రోజంతా వాన

- భారీ వర్షాలతో పోటెత్తుతున్న వరద
- కుంటలను తలపిస్తున్న పంట పొలాలు, రోడ్లు
- రాకపోకలు బంద్
- ఉరకలేస్తున్న వాగులు
- గేట్లు తెరుచుకున్న ప్రాజెక్టులు
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వర్షాలు ఎడతెరిపివ్వకుండా దంచికొడుతున్నాయి.. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. నదులు, ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. వాగులు ఉరకలేస్తున్నాయి. కొన్నిచోట్ల పంట పొలాలు, గ్రామాల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పైర్లు నీట మునిగి మురిగిపోతున్నాయి. వరదలతో మారుమూల గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇళ్లలోకి మురుగు నీరు చేరింది. కొన్ని గ్రామాల నుంచి బయటకు రావాలంటే ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటాల్సి ఉంది. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని వాగులను దాటుతున్నారు. సిద్దిపేట జిల్లాలో బుధవారం ఇలాంటి ఘటనే జరిగింది. ఓ వ్యక్తి చనిపోతే.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి అవతల ఉన్న శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేయాల్సి వచ్చింది. భద్రాద్రిలో గోదావరి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయమాయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఏజెన్సీల్లో కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. గోదావరి నది, కిన్నెరసాని ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల ప్రజలను మైదాన ప్రాంతాలకు తరలించారు. ఖమ్మం నగరంలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వైరా, పాలేరు రిజర్వాయర్లు అలుగు పోస్తున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం ఐదు గంటలకు 39.5 అడుగులు ఉన్న గోదారి క్రమేపీ పెరుగుతూ రాత్రి 10 గంటలకు 48.30 అడుగులకు చేరింది. దీంతో, అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పట్టణంలోని అశోక్‌నగర్ కొత్త కాలనీ కరకట్ట ప్రాంతంలో సుమారు 50 ఇళ్ల జలదిగ్భంధంలో చిక్కుకున్నాయి. ఆ ఇళ్ల వారిని రెవెన్యూ, పంచాయతీ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. రామాలయ ప్రాంతంలో స్లూయిజులు వద్ద మోటర్లు పూర్తిస్థాయిలో పని చేయకపోవడం వల్ల పరిసర ప్రాంతం, అన్నదాన సత్రం మొత్తం వరద నీటిలో చిక్కుకుంది. ఇప్పటికే ఈ నెలలో మూడుసార్లు అధికారుల నిర్లక్ష్యంతో వరద నీటితో సర్వం కోల్పోయిన వ్యాపారస్తులకు మరోసారి ముప్పు తప్పని పరిస్థితి నెలకొన్నది. కొత్త కాలనీలోని కరకట్ట ప్రాంతం మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటు గోదారి ఉగ్రరూపం.. అటు శబరి నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో పోలవరం ముంపు మండలాలైన చింతూరు, విఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. ఇప్పటికే వీఆర్ పురం, చింతూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు మండలంలోని అనేక గ్రామాలను శబరి ముంపుకి గురయ్యాయి. ఏజెన్సీ వ్యాప్తంగా అనేక గ్రామాలకు రాకపోకలు ఇప్పటికే నిలిచిపోయాయి. పోలవరం వద్ద కాపర్ డాం గేట్లు పూర్తిగా ఎత్తకపోవడం వల్ల ముంపు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం ఇదే నెలలో వరదలతో సర్వం కోల్పోయిన బాధితులు మరోసారి గోదారమ్మ ఉగ్రరూపానికి బలయ్యారు. గోదావరి పరివాహక మండలాలైన భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, అశ్వాపురం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పాల్వంచ కిన్నెరసాని పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి సామర్థ్యం 407 అడుగులు కాగా ప్రస్తుతం 405.80 అడుగులు నీరు చేరింది. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక చేశారు. కొత్తగూడెం, కిష్టారం, సత్తుపల్లి, మణుగూరు ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని అధికారులు తెలిపారు. మణుగూరులో కట్ట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 15 గేట్లు పూర్తి స్థాయిలో ఎత్తి 11,5956 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టును ప్రస్తుత హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సందర్శించి వరద ఉధృతిని పర్యవేక్షించారు. భద్రాచలం - పర్ణశాల మధ్య రోడ్డుపై రాకపోకలు నిలిచాయి.

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి బ్రిడ్జి వద్ద మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బిబినగర్ - పోచంపల్లికి రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. భువనగిరి రూరల్ సిఐ సత్యనారాయణ, బిబినగర్ ఎస్ఐ యుగేందర్ గౌడ్, పరిశీలించి బ్రిడ్జి వద్ద సిబ్బందిని కాపలా పెట్టారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షపాతం నమోదైంది. పలు చోట్ల భారీ వర్షం కురిసింది. నార్సింగ్ మున్సిపాలిటీలోని గౌలిదొడ్డి గ్రామంలో ఇళ్ల మధ్యన ఉన్న భారీ చెట్టు కూలిపోయింది. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బుద్వేల్ భగవత్‌గూడాలో ఓ వృద్ధురాలి ఇల్లు కూలిపోయింది.

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు అత్యధిక వర్షపాతం నమోదైంది. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఓ మోస్తారు వర్షపాతం నమోదైంది. శ్రీపాద ఎల్లంపలి ప్రాజెక్టు 11 గేట్లు ఎత్తి 81,137 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దిగువమానేరు ప్రాజెక్టులోకి మోయతుమ్మెద వాగు నుంచి వరద కొనసాగుతోంది. శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) ప్రాజెక్టులోకి ఎగువ నుంచి మానేరు, మూల వాగు ద్వారా 9వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 2గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు.

గుంతలమయమైన రోడ్లు

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని అభ్యుదయం కాలనీ జలమయమైంది. రోడ్లు నడవడానికి వీలు లేకుండా గుంతలు పడ్డాయి మంగపేట మండలంలో అబ్బాయిగూడెం ప్రధాన రోడ్డు కొట్టుకుపోయింది. శనిగకుంటకు వెళ్లే దారిలోని పెద్ద ఒర్రె పొంగిపొర్లుతూ రాకపోకలు నిలిచిపోయాయి. తిమ్మంపేట పెద్ద చెరువు, రామచంద్రునిపేట ఊర చెరువు, మంగపేట ఊర చెరువు, చెరుపల్లి చెరువులు మత్తళ్లు పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. గౌరారం వాగు, కమలాపురం ఎర్రవాగు, మల్లూరు వాగు, రాజుపేట ముసలమ్మ వాగులు పొంగిపొర్లుతున్నాయి. మేడిగడ్డ, లక్ష్మీ బ్యారేజి, తుపాకులగూడెం బ్యారేజ్ గేట్లను అధికారులు ఎత్తారు. రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడూ పరిశీలిస్తున్నారు. హనుమకొండ జిల్లా చౌరస్తా మొత్తం జలమయమైంది. ఆత్మకూర్ మండలంలో పత్తి పంటలు నీటిలో మునిగిపోగాయి. చలివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల వారిని మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కటాక్షపూర్ మత్తడితో రాకపోకలకు అంతరాయమేర్పడింది. కాజీపేట మండలం సోమిడి ప్రగతినగర్ కాలనీలో యాట హర్షవర్ధన్‌రెడ్డి ఇంటిపై పిడుగు పడటంతో ఎలక్ట్రికల్ వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శాయంపేటమండలంలో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్ట అలుగు పోస్తుంది. వరదతో సాగు భూముల్లో ఇసుక మేటలు వేశాయి. నారాయణపురం క్రాస్ రోడ్ నుంచి జామాల్ పురం గ్రామానికి వెళ్లే రోడ్డు వరద నీటితో గండిపడింది. వరంగల్ జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీళు చేరాయి. కల్లెడ ఆకేరు వాగు పాత బ్రిడ్జి సమీపంలో ఉన్న 120 ఏళ్ల చరిత్ర కలిగిన మర్రి చెట్టు(దెయ్యాల మర్రి) నేలమట్టమయింది. మానుకోట జిల్లా మున్నేరు, ఆకేరు, పాలేరు వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్నాయి. కేసముద్రం గూడూరు వెళ్లే రహదారులు అర్పణ పెల్లి వాగు పొంగిపోయి రాకపోకలు రద్దయ్యాయి. బ్రిడ్జిపై నుంచి భారీగా నీరు ప్రవహిస్తోంది. మానుకోట-వరంగల్‌కు రహదారులు బంద్ అయ్యాయి. మానుకోట పట్టణంలో జూనియర్ కళాశాల ఎదురుగా డిఎస్‌పి కార్యాలయం వద్ద మురికి కాలులు పొంగి పొల్లి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.

మూసీకి పోటెత్తిన వరద

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద ప్రాజెక్టు అయిన మూసీ రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో బుధవారం ప్రాజెక్టు ఏడు క్రస్ట్ గేట్లను మూడు అడుగుల ఎత్తు మేర ఎత్తి దిగువకు 13,308 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి 10,354 వరద నీరు వచ్చి చేరుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 642.10 అడుగుల వద్దకు చేరుకుంది. పూర్తిస్థాయి సామర్థ్యం 4.46 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 3.72 టిఎంసిలు నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా 282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఏడు గేట్లను ఒకేసారి మూడు అడుగుల ఎత్తు లేపడంతో దిగువ మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మూసీ గేట్లు ఎత్తడంతో పర్యాటకుల సందడి ఎక్కువైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నామని డ్యామ్ ఇంజినీర్లు ఉదయ్‌కుమార్, మమత చెప్పారు.

జంట జలాశయాలకు భారీగా వరద నీరు

ఎగువ ప్రాంతాల నుంచి జంట జలాశయాలలోకి నీటి వరద ప్రవాహం పెరిగింది. వరద ఉధృతికి జంట జలాశయాల గేట్లను ఎత్తారు. బుధవారం రాజేంద్రనగర్ ప్రకాష్‌గౌడ్ అధికారులతో కలిసి ఉస్మాన్‌సాగర్ (గండిపేట్) రెండు గేట్లను ఎత్తారు. ఎగువ ప్రాంతాలైన తాండూర్, పరిగి వికారాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల నుంచి మూసీ ఉధృతంగా ప్రవహించడంతో గండిపేట చెరువు నీటిమట్టం పూర్తిగా నిండిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 208 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఇప్పటికే హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. వరద మరింత పెరిగితే ఉస్మాన్‌సాగర్ మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందన్నారు. గేట్లు ఎత్తడంతో మూసీకి దిగువన ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మూసీ పరివాహ ప్రాంతాలకు ఎవరూ వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

బీడీ కార్మికులకు కుర్‌కురేలను అంటగట్టం

- హామీ ఇచ్చిన యాజమాన్యం
- కంపెనీ యాజమాన్యంతో సిఐటియు చర్చలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బలవంతంగా బీడీ కార్మికులకు కుర్‌కురేలను అంటగట్టబోమని బీడీ యాజమాన్యం హామీనిచ్చిందని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం బీడీ కార్మికులతో బలవంతంగా కుర్‌కురేలు, తిను బండారాలను అమ్మిస్తూ.. వారికి వచ్చే బట్వాడాల నుంచి డబ్బులు తీసుకుంటున్న విషయాన్ని దశల వారి పోరాటాల ద్వారా కార్మిక శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయంలో నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, మోహన్, జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్‌తో.. దేశాయ్ బీడీ కంపెనీ యాజమాన్యం తరపున అనిల్, సంజయ్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బీడీ కార్ఖానాల్లో కార్మికులకు కుర్‌కురేలను కానీ, ఇతర తినుబండారాలను కానీ అమ్మకాలు జరపకుండా చర్యలు చేపడతామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఒకవేళ ఎవరికైనా బలవంతంగా వాటిని అమ్మితే నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఇకపైన ఏ కార్ఖానాల్లో కార్మికులు వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్మికుల బట్వాడాల్లో కోతలు లేకుండా చూస్తామని హామీ నిచ్చారు. చర్చల్లో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సమయమివ్వండి

- హైకోర్టులో వనమా లంచ్‌మోషన్ పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలని హైకోర్టులో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు బుధవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు వెళ్లేందుకు తనకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు అత్యవసర పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం.. తీర్పును రిజర్వు చేసింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. తప్పుడు వివరాలతో వాస్తవాలను దాచి ఎన్నికల అఫిడవిట్ సమర్పించినందుకు శిక్షగా ఆయనకు రూ.ఐదు లక్షల జరిమానా విధించింది. దీంతోపాటు పిటిషనర్ జలగం వెంకట్రావు కోర్టు ఖర్చులనూ చెల్లించాలని ఆదేశించింది. జలగం వెంకట్రావు 2018 డిసెంబరు 12 నుంచి కొత్తగూడెం ఎమ్మెల్యేగా కొనసాగుతారని ప్రకటించింది. 2018 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచిన వనమా వెంకటేశ్వరరావు ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ టిఆర్ఎస్ తరపున పోటీ చేసిన జలగం వెంకట్రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జి రాధారాణి సుదీర్ఘ విచారణ చేపట్టి మంగళవారం 84 పేజీల తీర్పును వెలువరించారు.

దావా సమను
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS :1/2022
Between:-
రావిపూడి హనుమంతరావు వగైరాలు .....వాదులు
మరియు
మురకొండ రాజేంద్రప్రసాద్ ...ప్రతివాది
To
మురకొండ రాజేంద్రప్రసాద్ S/o భూషయ్య @ బోసుబాబు - సన్ రా ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నెం-301 Dwellings. Sy. No:74&75, జైహింద్ ఎన్‌క్లేవ్, మాదాపూర్, హైదరాబాద్ 500081, తెలంగాణా రాష్ట్రం.
పై నంబరు గల దావాను మీ పై దాఖలు చేసి మీకు ఎన్ని మార్లు దావా సమన్లు పంపినను చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 04-08-2023 న ఉ.10-30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గాని. పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనిఎ డల మీ పరోక్షము నందు దావాను విచారించి తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది : 04-08-2023
ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు

ఇంజినీరింగ్ రెండో విడతలో

వెబ్‌ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న రెండోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు గురువారంతో ముగియనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు 5,301 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈనెల 31లోపు రెండోవిడత సీట్లు కేటాయింపు ఉంటుందని వివరించారు. ఇప్పటి వరకు 38,318 మంది అభ్యర్థులు 14,66,391 వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని పేర్కొన్నారు. ఒక అభ్యర్థి అత్యధికంగా 672 ఆప్షన్లను ఇచ్చారని తెలిపారు. ఇంజినీరింగ్ రెండో విడతలో 30,125 సీట్లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే.

భార్యభర్తల దారుణ హత్య

- కామారెడ్డి జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో దంపతులు దారుణహత్యకు గురైన ఘటన సంచలనం రేపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన దారం నారాయణ గుప్తా (75) భార్య సుశీల(65) ఇంట్లోనే కిరాణా దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి సంతానం లేదు. వ్యాపారం ద్వారా దాచుకున్న కొంత డబ్బును ఇతరులకు అప్పుగా ఇస్తుంటారు. కాగా బుధవారం తెల్లవారుజామున ఇంటి వెనుక నుంచి నిచ్చెన వేసుకొని ఇంట్లోకి చొరబడ్డ దుండగులు.. అరుపులు, కేకలు బయటకు వినపడకుండా టీవీ శబ్దం ఎక్కువ చేసి.. నారాయణ గుప్తాను మరణాయుధంతో తలపై బాది హత్య చేశారు. అనంతరం సుశీలను హాలులోకి తీసుకెళ్లి చీరతో ఉరేశారు. ఉదయమైనా నారాయణగుప్త ఇంటి తలుపులు మూసి ఉండటంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే బాన్సువాడ రూరల్ సిఐ మురళి, బాన్సువాడ డిఎస్‌పి రఘునాథరెడ్డి రైతునగర్‌లోని ఘటనాస్థలికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకొని పరిశీలించారు. దుండగులను పట్టుకునేందుకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భార్యభర్తలు ఇద్దరు కూడా ఎవరినీ పల్లెత్తు మాట అనేవారు కాదని గ్రామస్తులు తెలిపారు. కాగా పోలీసులు హత్యకు సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు.

వార్డు ఆఫీసులో పామును వదిలిన యువకుడు

- అధికారులు ఫిర్యాదు పట్టించుకోవడం లేదని ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద నీటితోపాటు పాములు కూడా ఇళ్లలోకి వస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఓ యువకుడు వినూత్నంగా నిరసన తెలిపాడు. ఓ పామును పట్టుకొచ్చి నేరుగా జిహెచ్ఎంసి వార్డు ఆఫీసులో వదిలి పెట్టాడు. ఈ ఘటన హైదరాబాద్ అల్వాల్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భారీ వర్షాలకు నగరంలో పలుచోట్ల ఇండ్లలోకి వరద నీరు వస్తోంది. అల్వాల్ ప్రాంతంలో సంపత్‌కుమార్ ఇంట్లోకి వరద నీటితోపాటు ఓ పాము కూడా వచ్చింది. దాంతో అతను వెంటనే జిహెచ్ఎంసి హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసి ఆరు గంటలు గడిచినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో అతను పామును ఓ డబ్బాలోకి పట్టుకుని నేరుగా అల్వాల్ జిహెచ్ఎంసి వార్డు కార్యాలయానికి తీసుకొచ్చాడు. అక్కడ టేబుల్‌పై పామును వదిలిపెట్టి నిరసన తెలిపాడు. దీంతో అధికారులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధకు తాళలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హన్మకొండ జిల్లా దామెర మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మన్నపేట గ్రామానికి చెందిన బండి వెంకటేష్ (32) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత రెండేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయి. ఈ ఏడాది వేసిన పత్తి పంట కూడా అధిక వర్షాలకు దెబ్బతింది. దాంతో అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై గడ్డి మందు తాగాడు. గమనించిన స్థానికులు ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. వెంకటేష్ తల్లి సాంబలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

ఎస్ఆర్‌సిపికి జలకళ.. కెసిఆర్‌తోనే సాధ్యం

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఆర్‌సిపికి జలకళ సిఎం కెసిఆర్‌తోనే సాధ్యమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని శ్రీరామ్‌సాగర్ (ఎస్ఆర్‌సిపి) ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టి 60 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రాజెక్టు వద్ద బుధవారం నిర్వహించిన 'శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 60 వసంతాలు వేడుక'లకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు ఎస్ఆర్‌సిపి ప్రాజెక్ట్‌పై ఉన్న భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్ఆర్‌సిపి పునరుజ్జీవ పథకంలో భాగంగా నిర్మించిన ముప్కాల్ పంప్ హౌజ్ వద్ద జరిగిన వేడుకల్లో మంత్రి ప్రసంగించారు. 1951లో ఆనాటి హైదరాబాద్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదనలు పంపిస్తే.. 12 సంవత్సరాల అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1963లో నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.40 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. 1983లో ఎస్ఆర్‌సిపి పూర్తి చేసి డ్యాంలో నీటిని నింపారన్నారు. ప్రాజెక్ట్ మొదటి ఫేజ్ పూర్తి కావడానికి సుమారు 20 ఏళ్లు పట్టిందని తెలిపారు. 2015-16లో పది లక్షల ఎకరాల అయకట్టుకు నీళ్ల అందించేలా రెండో ఫేజ్ పనులు పూర్తయ్యాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందని కెసిఆర్ ఎన్నో సార్లు ఆవేదన వ్యక్తం చేశారని, ఆంధ్ర ప్రాజెక్టులు వైష్ణవాలయాలుగా, తెలంగాణ ప్రాజెక్టులు శివాలయాలుగా ఉన్నాయని 1996లో ఎస్ఆర్‌సిపి కట్ట మీద ప్రాజెక్ట్ దుస్థితి చూసి కెసిఆర్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఎన్నో సార్లు ఎండిపోయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ చూశానని, పునరుజ్జీవ పథకం ద్వారా కాళేశ్వరం జలాలు శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చామని, ఎస్ఆర్‌సిపి ద్వారా 18 లక్షల ఎకరాలకు నీరందించేలా ప్రణాళికలు చేశామని తెలిపారు. ప్యాకేజీ 21, 22 ద్వారా ఉమ్మడి జిల్లాలోని గ్రామాలకు కాళేశ్వరం జలాలను త్వరలో అందిస్తామన్నారు. ఈ వేడుకల్లో ఉద్యమకారుడు, రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ శాఖ సలహాదారు శ్రీధర్ రావుదేశ్ పాండే, ఇఎన్‌సి నాగేందర్, ఎస్ఆర్‌సిపి సిఇ సుధాకర్‌రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్ట్ సిఇ నల్లా వెంకటేశ్వర్లు, నిజామాబాద్ సిఇ మధుసూదన్ పాల్గొన్నారు.

వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఉప్పొంగుతున్న వాగులో పాడె మోత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లాలో మరణించిన వ్యక్తి అంత్యక్రియల కోసం ఉప్పొంగుతున్న వాగులో పాడె మోస్తూ గ్రామస్తులు, బంధువులు ఈదుకుంటూ అవస్థలు పడిన ఘటన తాజాగా చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే... చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన బసవరాజు బాలయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామస్తులు, బంధువులందరూ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు ఉప్పొంగి ఉంది. శ్మశానవాటిక వాగు అవతలి వైపు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చేర్యాల వేచరేణి గ్రామాల మధ్య వాగు ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.96 కోట్లు కేటాయించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య అసహనం వ్యక్తం చేశారు. ఈ కాంట్రాక్ట్ అక్టోబర్‌తో ముగుస్తున్నందున ఇప్పటికైనా పనులు చేపట్టాలని కోరారు.

అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్‌లో ప్రమాదం

- పైప్ తగిలి కార్మికుడు మృతి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ఆర్జీ-3 పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు (ఎఎల్‌పి)లో మంగళవారం రాత్రి రెండో షిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ప్రాజెక్టులో బొగ్గు ఉత్పత్తి పనులు జరుగుతున్న సమయంలో లాంగ్ వాల్ మిషన్‌కు ఉన్న ఓస్ పైప్ ఒక్కసారిగా ఊడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎంజెడబ్ల్యు కార్మికుడు బూర్ల సారయ్య (40) ఛాతికి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గోదావరిఖని పట్టణంలోని సింగరేణి రామగుండం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సారయ్య కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆస్పత్రిలో కార్మికుని మృతదేహాన్ని పలువురు రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల నాయకులు బుధవారం పరిశీలించారు.

ఉత్పత్తిపైనే శ్రద్ధ..

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికులకు రక్షణ ఏర్పాట్లు చేయడంతో యాజమాన్యం చూపడం లేదని ఎస్‌సిఇయు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. కార్మికుడు సారయ్య మృతదేహాన్ని ఆయన సందర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి అధికారులు వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు దొమ్మేటి కొమురయ్య, ఎం వెంకటేశ్వర్లు, ఎండిఅహ్మద్ పాషా, డి రవి కుమార్ తదితరులున్నారు.

సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు , తుమ్మల రాజారెడ్డి

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద అమ్మకపు ప్రకటన
మెసర్స్ ఎంపీ సుగర్స్ & కెమికల్స్ లిమిటెడ్- ఇన్ లిక్విడేషన్
(సిఐఎన్: ఎల్24110ఏపి1988పిఎల్‌సి009291)
రిజిస్టర్డు ఆఫీసు: అయ్యపరెడ్డిపాలెంనాయుడుపేట్ మండలం, నెల్లూరు జిల్లా, ఏ.పి.-524126 ఇండియా

లిక్విడేటర్ ఆఫీసు: 29, 1వ అంతస్తు, ఎస్ఎన్ కాంప్లెక్స్, 14వ క్రాస్, 5వ మెయిన్ రోడ్, ఇ-బ్లాక్ ఎక్స్‌టెన్షన్, సహకార నగర్, బెంగళూరు-560094
మొబైల్: 9845002523/ 080-6844 6987, ఇ-మెయిల్: e-mail: plan@psri.in ; ip.empee@gmail.com
ఇన్‌సాల్వెన్సీ& బ్యాంక్రప్టసీ కోడ్ 2016 క్రింద ఇ-వేలం
ఇ-వేలం తేది& సమయం- గురువారం, 31 ఆగస్టు 2023న మ॥ 03:00గం.ల నుండి సా॥ 05:00గం.లు వరకు (ప్రతిసారి 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

మెసర్స్ ఎంపీ సుగర్స్& కెమికల్స్ లిమిటెడ్ (ఇఎస్‌సిఎల్) యొక్క ఆస్తుల అమ్మకం- ఇన్ లిక్విడేషన్ (కార్పొరేట్ డెటర్) అనునది లిక్విడేటర్ చేత లిక్విడేషన్ ఎస్టేట్‌లో భాగంగా, తేది: 10.02.2023 నాటి గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ వారిచే నియమించుట జరిగింది. అమ్మకం అనునది క్రింది సంతకందారుచేత ఇ-వేలం ప్లాట్‌ఫారం నేషనల్ ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ఇఎస్ఎల్) ద్వారా, https://nesl.co.in/auction-notices-under-ibc/ వద్ద లింకు కలిగియుండి/ "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన మరియు "ఏవేని రికోర్స్ లేకుండా ప్రాతిపదికన" చేపట్టబడుతుంది.

బ్లాక్	అసెట్స్ వివరాలు	రిజర్వు ధర (రూ.కోట్లలో)	ధరావత్తు మొత్తం (రూ. కోట్లలో)	పెంపుదల/ విలువ (రూ. కోట్లలో)
1	(1) నాయుడుపేట్ ఫ్యాక్టరీ- సుగర్& డిస్టిలరీ ఫ్యాక్టరీ ప్లాంట్& మిషనరీ& ల్యాండ్ (విస్తీర్ణం సుమారు 112ఎకరాలు) మరియు భవనము (2) అంబసముద్రం ఫ్యాక్టరీ- ల్యాండ్ (విస్తీర్ణం సుమారు 220 ఎకరాలు) మరియు భవనము కలిగియున్న సంబంధితులుగా కార్పొరేట్ డెటర్ యొక్క అమ్మకం (వివరాల కొరకు ఇ-వేలం ప్రక్రియ మెమోరండంను రెఫర్‌చేయండి).	60.00	6.00	0.25
2	నెల్లూరు జిల్లా, నాయుడుపేట్ మండలం, అయ్యపరెడ్డిపాలెం- 524126 వద్దగల ల్యాండ్ యొక్క స్థిరాస్తులు (విస్తీర్ణం సుమారు 112 ఎకరాలుతోసహా)& భవనము& ప్లాంట్& మిషనరీ) కలిగియున్న ఆస్తులన్నింటితోపాటు నాయుడుపేట్ సుగర్& డిస్టిల్లరీ యూనిట్ యొక్క అమ్మకం.	40.00	4.00	0.25
3	ముక్కూడల్ గ్రామం, అంబసముద్రం, తిరునెల్వేలి జిల్లా, తమిళనాడు వద్దగల ల్యాండ్ (విస్తీర్ణం సుమారు 220ఎకరాలు) మరియు భవనాలు కలిగియున్న అంబసముద్రం యూనిట్ అమ్మకం.	20.00	2.00	0.10
4	అయ్యపరెడ్డిపాలెం, నాయుడుపేట్ మండలం, నెల్లూరు జిల్లా-524126 వద్దగల ల్యాండ్ (విస్తీర్ణం సుమారు 120ఎకరాలు) మరియు భవనము యొక్క అమ్మకం.	25.00	2.50	0.10
5	అయ్యపరెడ్డిపాలెం, నాయుడుపేట్ మండలం, నెల్లూరు జిల్లా-524126 వద్దగల సుగర్ ఫ్యాక్టరీ (ప్లాంట్& మిషనరీ కలిగియున్న) యొక్క అమ్మకం.	8.50	0.85	0.10
6	అయ్యపరెడ్డిపాలెం, నాయుడుపేట్ మండలం, నెల్లూరు జిల్లా-524126 వద్దగల డిస్టిల్లరీ ఫ్యాక్టరీ (ప్లాంట్& మిషనరీ కలిగియున్న) యొక్క అమ్మకం.	6.50	0.65	0.10

ముఖ్యమైన గమనికలు:
1. పరిశీలన తేది: 13 ఆగస్టు 2023 నుండి 23 ఆగస్టు 2023 వరకు.
2. అసెట్స్ అమ్మకం అనునది ఇ-వేలం ద్వారా ఖచ్చితంగా **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది ప్రాతిపదికన" మరియు "ఏవేని రీకోర్స్‌లేకుండా"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది.
3. ఇది భావించునది ఏమనగా, అమ్మకంకు వర్తించు కంపెనీ లేదా లిక్విడేటర్ భాగంపై ఏదేని రకమైన బైండింగ్ ఆబ్లిగేషన్ క్రియేట్‌చేయకుండా మరియు ఆసక్తిగల బిడ్డరుదారులను ఆహ్వానిస్తున్నారు. లిక్విడేటర్ ప్రక్రియలో అతని ఆసక్తితో ఇ-వేలం సమయాలతోసహా ఏవేని నియమాలు నిబంధనలును తీసివేయు, పొడిగింపు/డెఫర్/ రద్దుచేయు మరియు ఏ కారణంచూపకుండా ఏదేని స్థాయిలో ఏవేని ముందస్తు ప్రకటన ఇవ్వకుండానే ఏదేని బిడ్‌ను ఆమోదించు లేదా తిరస్కరించు అధికారాలు కలిగియుంటారు.
4. ధరావత్తు దాఖలు మరియు పాల్గొను ప్రక్రియకు ముందు ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం నుండి అన్ని నియమాలు& నిబంధనలు తప్పనిసరిగా పరిశీలించవలెను. ఆస్తులు, ఆన్‌లైన్ ఇ-వేలం యొక్క నియమాలు& నిబంధనలు, బిడ్ ఫారం, అర్హత నియమావళి, బిడ్డరుదారుల ద్వారా డిక్లరేషన్, కావలసిన ధరావత్తు మొ॥ వివరాలు కలిగియున్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం at https://nesl.co.in/auction-notices-under-ibc/ వద్ద మరియు www.psri.in/escl/ వద్ద అందుబాటులో ఉంటాయి.
5. వాటాదారుల కన్సల్టేషన్ కమిటీతో సంప్రదింపులలో లిక్విడేటర్, బ్లాక్ 1 లేదా బ్లాక్2 నుండి 6 మధ్య సెలెక్షన్ ప్రాధాన్యతకు పరిశీలణతో సరైన హక్కులు కలిగియుంటారు. తదుపరి సందేహాల కొరకు ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రంను దయచేసి పరిశీలించండి.
6. పత్రాలకు సంబంధించిన బిడ్‌ను సిఫారసుచేసిన ఫార్మేట్స్‌లో ఇ-మెయిల్ ద్వారా మరియు లిక్విడేటర్ కార్యాలయంకు ఒరిజినల్ కాపీల హార్డ్ కాపీలను సమర్పించవలసి ఉంటుంది.
7. ఆసక్తిగల బిడ్డరుదారులు వారి బిడ్ సమర్పించుటకు ముందు, ఆస్తికి సంబంధించిన టైటిల్, స్థానిక పన్నుల బకాయిలు, విద్యుత్తు మరియు నీటి చార్జీలు, మెయింటేనన్స్ చార్జీలు వంటి విచారణలు జరుపుకోవలెను, వారు వారి స్వంత ఖర్చులతో పరిశీలించుకోవలెను మరియు వారంతట వారుగా సంతృప్తిచెందవలెను.
8. అన్ని బిడ్ పత్రాలుతోపాటు ఈఓఐ, రిఫండబుల్ పార్టిసిపెంటేషన్ డిపాజిట్ మనీ సమర్పించుటకు చివరి తేది 11.08.2023.
9. ధరావత్తు దాఖలుచేయుటకు చివరి తేది 28.08.2023న లేదా ముందుగా.
10. ఇ-వేలం తేది& సమయం **31.08.2023న మ॥ 3:00గం.ల నుండి సా॥ 5:00గం.లు వరకు** 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో.
11. ఎవరైతే ధరావత్తును డిపాజిట్‌చేశారో అట్టి ఆసక్తిగల దరఖాస్తుదారు మరియు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేయుటలో కావలసిన సహకారం కొరకు లిక్విడేటర్ యొక్క కార్యాలయంను 080-68446987 పై లేదా ip.empee@gmail.com or plan@psri.in వద్ద ఇ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చును.

పంకజ్ శ్రీవాస్తవ
లిక్విడేటర్- ఎంపీ సుగర్స్& కెమికల్స్ లిమిటెడ్
సంప్రదించండి: 29, 1వ అంతస్తు, ఎస్ఎన్ కాంప్లెక్స్, 14వ క్రాస్, 5వ మెయిన్ రోడ్, ఇ-బ్లాక్ ఎక్స్‌టెన్షన్, సహకార్ నగర్, బెంగళూరు-560094
Regn No: IBBI/IPA-001/IP-P00245 /2017-18/10474
ఏఎఫ్ఏ వాలిడ్ తేది: 23.11.2023 వరకు
తేది: గురువారం, 27 జులై, 2023
ప్రదేశం: బెంగళూరు
080 6844 6987| ip.empee@gmail.com | psri@live.com.| www.psri.in/escl/

అటవీ భూములు మాయం..!

- రూ.350 కోట్ల విలువ చేసే భూమి కాజేసిన రియల్టర్లు
- సేత్వార్, ఖాస్రా పహాణీల్లో సర్కార్ భూమిగా నమోదు
- ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే రికార్డులు మార్పు?
- హెచ్ఎండిఎ మాస్టర్ ప్లాన్‌లో జోన్ పరిధి నుంచి తొలగింపు
- తమాకేం తెలియదంటున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ నేతలు.. ప్రభుత్వ పెద్దలు.. రియల్టర్లు.. ఆక్రమణదారులు.. ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ధరణి పోర్టల్ ఉపయోగపడుతోంది. కంటికి కనిపించిన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ధరణి పోర్టల్‌లో లోపాలను తమకు ఆయుధాలుగా మలుచుకుంటున్నారు. సర్కారు భూమా, అటవీ భూమా, సీలింగ్ భూములా అనే తేడా లేకుండా కోట్ల విలువ గల భూమైతే చాలు.. రికార్డులు మార్చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని పట్టాగా మార్చుకోవడమే కాకుండా హెచ్ఎండిఎ మాస్టర్ ప్లాన్‌లో ఉన్న జోన్ కూడా మార్చేసిన ఘనులు వారు. ఆ రకంగా కోట్ల రూపాయల అటవీ భూమిని మాయ చేసి పట్టా భూమిగా మార్చుకున్న వైనం బయటపడింది. అధికారులనే పావులుగా వాడుకుని ఇదంతా చక్కబెట్టడం గమనార్హం. దీనిపై సంబంధింత రెవెన్యూ అధికారులను ఎవరిని అడిగినా ఏమీ తెలియదని దాటవేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా.. ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వ భూములకు కాపలా ఉండాల్సిన వారే నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొంతమంది రైతులు, స్థానికులు, అధికారులు అందించిన వివరాల ప్రకారం.. ప్రత్యేక కథనం.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 249లో 1026.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో కొంత భాగం అటవీశాఖ పరిధిలో ఉండగా, మరి కొంత సర్కారీ భూమిగా నమోదైంది. 1960-61 నుంచి 1964-65 వరకు ఖాస్రా, సేత్వార్ పహాణీల్లోనూ ఇది సర్కారు కంచెగా నమోదైంది. దీనిలో కొంత సాగుకు యోగ్యంగా ఉండటంతో స్థానికంగా ఉన్న పేద రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. 1980-81 నుంచి 1985-86 వరకు సర్వే నంబర్లు 249, 249/1 మినహా సర్వే నంబర్ 249/2 నుంచి 249/17 వరకు ఉన్న 70.24 ఎకరాలు పట్టా భూమిగా మారింది. 249/1 మాత్రం అలాగే వదిలేసి, ఆ తర్వాత వచ్చిన 249/2 నుంచి 249/17 సర్వే నంబర్లలోని భూమి పట్టా భూమిగా మారింది. నిజానికి ఈ భూములు హెచ్ఎండిఎ మాస్టర్ ప్లాన్‌లోనూ గ్రీన్‌జోన్ కింద నమోదై ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలకు అవకాశం లేదు. కొంత మంది నేతలు, అధికారులు ఓ ప్రణాళిక ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో ఉన్న లోపాలను అవకాశంగా తీసుకుని రైతుల నుంచి చాలా తక్కువ ధరకు ఈ భూములను కొట్టేసినట్టు తెలిసింది. ఆ తర్వాత తమకున్న అధికార, ఆర్థిక బలంతో రెవెన్యూ, అటవీశాఖల అధికారులను మేనేజ్ చేయడం.. అసలు సర్వే నంబర్‌కు అనేక సబ్ డివిజన్లు సృష్టించడం చకచకా చేశారని సమాచారం. గ్రీన్‌జోన్ పరిధిలో ఉన్న తమ భూములకు విముక్తి కల్పించాలని కోరుతూ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన రిఫరెన్స్ లెటర్లతో హెచ్ఎండిఎకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వంలోని పెద్దలు చెప్పిందే తడవుగా హెచ్ఎంఎ అధికారులు సైతం ఏ మాత్రం ఆలోచించకుండా సదరు సర్వే నంబర్లలోని భూమిని మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయి. 249/1లోని భూమి గ్రీన్‌జోన్‌లో ఉంటే ఆ పక్కనే ఆనుకుని ఉన్న వివాదాస్పద సర్వే నంబర్లలోని భూములు మాత్రం ఎలా రెసిడెన్షియల్ జోన్‌లోకి మారాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఎన్ఒసిల జారీపై అనుమానాలెన్నో..?

అటవీ శాఖ తన భూములను నిర్ధారించక ముందే అప్పటి ఇన్‌చార్జి కలెక్టర్ ఏకంగా అవి ప్రయివేట్ పట్టా భూములుగా నిర్ధారిస్తూ ఎన్ఒసి పత్రం (16/11/2019) జారీ చేశారు. కలెక్టర్ ఎన్ఒసి జారీ చేసిన ఏడాది తర్వాత అటవీ శాఖ (799 ఎకరాలు)గా నిర్ధారిస్తూ రిపోర్టు ఇవ్వడంపైనా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతేకాదు అప్పటి కలెక్టర్ జారీ చేసిన ఒక ఎన్ఒసిపై సంతకం లేదు. మరో ఎన్ఒసీపై సంతకం ఉండటం గమనార్హం. ఇలా ఒకే భూమికి రెండు ఎన్ఒసిలు జారీ అయ్యాయి. అంతే కాదు 2018 ముందు ఆయా రైతుల పేరున ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల్లోనూ ఆ భూములు అమ్మడం కొనడం నిషేధం అని రాసి ఉంది. ధరణి వచ్చిన తర్వాత ఈ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయలేదు. దాంతో కొనుగోలుదారులు ప్లాన్ ప్రకారం వీటిని పెండింగ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిసింది.

తొలుత పెండింగ్ రిజిస్ట్రేషన్

ధరణిలో తమ పేర్లు రికార్డు చేయించుకుని, పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి తమ డాక్యుమెంట్‌లను రిలీజ్ చేసుకున్నారు. ఆయా భూములన్నీ పట్టా భూములే అయితే వాటిని కొనుగోలు చేసిన వారు డాక్యుమెంట్‌ను సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పెండింగ్ జాబితాలో పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతుంది. అంతేకాదు ఇప్పటి వరకు ఆ భూములను అమ్మిన రైతులకు మొత్తం కాకుండా సగం డబ్బులు మాత్రమే చెల్లించారు. దీనిపై సరైన వివరణ ఇచ్చే అధికారులే లేరు. తమ హయాంలో జరిగింది కాదని, ఆ విషయాలు ఏవీ తెలియవన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి డాక్యుమెంట్లు ఉన్నా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ప్రాణాలకు తెగించి వైద్య సేవలు

ప్రభుత్వ వైద్యులకు గ్రామస్తుల అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల్లో సైతం వైద్య సిబ్బంది ప్రాణాలు పణంగా పెట్టి గిరిజన గ్రామాల ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి ఆస్పత్రి వైద్యాధికారి కారం నిఖిల్ తన సిబ్బంది బుధవారం కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయక ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటి ఆస్పత్రి పరిధి దోమెడ గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమెడలో ఇంటి కొకరు జ్వరం, వైరల్, మలేరియా భారినపడి మంచాన పడ్డట్టు గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న వైద్యాధికారి తన వైద్య బృందంతో గ్రామానికి వెళ్లి వైద్యం అందించారు. వర్షాల కారణంగా దోమెడకు వెళ్లే వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అది దాటి గిరిజనులు ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోలేని స్థితిని దృష్టిలో పెట్టుకుని గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు, రక్త నమూనాలు సేకరించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు డాక్టర్ నిఖిల్ తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్ రాంబాబు, ఎఎన్ఎం సీతారావమ్మ, ఆశ, నళిని, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు అమలు చేయండి

- సిఇఒ వికాస్‌రాజ్‌ను కలిసిన జలగం వెంకట్రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగూడెం ఎమ్మెల్యేగా తనను ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కోరారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో బుధవారం వెంకట్రావు సిఇఒను కలిసారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పు ప్రతులను సిఇఒకు అందజేశారు. కేసు వివరాలను వెల్లడించారు. హైకోర్టు జడ్జిమెంట్ ప్రకారం తనను ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు శాసనసభలోని స్పీకర్ కార్యాలయానికి వచ్చిన జలగం..హైకోర్టు తీర్పు ప్రతులను స్పీకర్ కార్యలయంలో అందజేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు.

పల్లెవెలుగు బస్సుల్లో కొత్తగా టి9-30 టికెట్

- రూ.50తో 30 కిమీ పరిధిలో ప్రయాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వివిధ స్కీమ్‌లతో ప్రయాణికులను ఆకట్టుకుంటూ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే పలు ప్రత్యేకంగా టికెట్‌లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో తాజాగా 'టి9-30' పేరుతో స్పెషల్ టికెట్‌ను ప్రకటించింది. ప్రస్తుతం టి9-60 టికెట్ అందుబాటులో ఉండగా.. ప్రయాణికులపై భారాన్ని తగ్గించేందుకు టి9-30 టికెట్‌ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో బుధవారం ఆర్‌టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్‌రెడ్డి, సంస్థ ఎండి సజ్జనార్ టీ9-30 టికెట్‌ను ఆవిష్కరించారు. రూ.50 ప్రయాణికులు టికెట్‌ను కొనుగోలు చేస్తే 30 కిలో మీటర్ల పరిధిలో వచ్చేపోయే వెసులుబాటు ఉంటుందని వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ టికెట్ చెల్లుబాటవుతుందని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి టికెట్ అమలులోకి వస్తుందని, పల్లె వెలుగు బస్‌లో కండక్టర్ల వద్ద టికెట్ అందుబాటులో ఉంటుందని వివరించారు. తక్కువ దూరం ప్రయాణించే ఉద్యోగులతో పాటు కార్మికులు, ఇతర ప్రయాణికులకు సైతం ఈ టికెట్ ఉపయుక్తంగా ఉంటుందని ఆర్‌టిసి అధికారులు పేర్కొన్నారు. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాలు వెళ్లి వచ్చేందుకు సైతం టికెట్ వర్తిస్తుందని ఆర్‌టిసి తెలిపింది. టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతుందని తెలిపింది. ఈ టికెట్ తీసుకున్న ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో రూ.20 కాంబినేషన్ టికెట్ తీసుకొని ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించేందుకు అవకాశం ఉందని వెల్లడించింది. నెల రోజులపాటు టికెట్ అందుబాటులో ఉంటుందని, ఆ తర్వాత ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనను బట్టి పొడిగింపుపై సంస్థ నిర్ణయం తీసుకోనున్నది. ఇటీవల తీసుకువచ్చిన టి9-60 టికెట్‌ను పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వారికి సైతం వర్తింపజేస్తున్నట్లు బాజిరెడ్డి, సజ్జనార్ తెలిపారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్ కోసం తీసుకువచ్చిన టికెట్‌ను గురువారం నుంచి పురుష ప్రయాణికులకు సైతం అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ఆగి ఉన్న బస్సులో రూ.28 లక్షలు అపహరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగి ఉన్న ప్రయివేటు బస్సులో నుంచి రూ.28 లక్షలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపులాయిపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి 65పై ఉన్న పూ.ఇత హోటల్ వద్ద జరిగింది. ఆ ప్రాంతంలో ఆగి ఉన్న బస్సుల్లో చోరీ జరగడం ఇది మూడోసారి. స్థానిక ఎస్ఐ సైదాబాబు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలావర్ధపల్లిలోని కృష్ణాపురం కాలనీలో నివాసముంటున్న పాండా సుశాంత్‌కుమార్ త్రిశక్తి ప్లాస్టిక్ ట్రేడింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలో తనకు వ్యాపారంలో రావాల్సిన డబ్బుల కోసం వెళ్లారు. రూ.28 లక్షలు తీసుకొని, ఒక బ్యాగులో రూ.24లక్షలు, మరొక బ్యాగులో రూ.4 లక్షలతోపాటు బట్టలు పెట్టుకొని హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో ఒడిశాలోని బరంపూర్‌లో ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో మంగళవారం రాత్రి ఎక్కారు. ఆ బస్సును నార్కట్‌పల్లి శివారులోని జాతీయ రహదారి 65పై పూజిత హోటల్ వద్ద టీ, టిఫిన్ కోసం డ్రైవర్ ఆపారు. బ్యాగులను బస్సులోనే ఉంచి టీ కోసం అందరితో పాటు సుశాంత్ కూడా హోటల్‌కు వెళ్లారు. అతడు తిరిగి వచ్చి చూడగా బ్యాగులు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులు ఉన్న డబ్బును తీసుకుని పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్షాలకు గజ్వేల్‌లో ఎర్రబారుతున్న మొలకలు

- దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆలస్యంగా సాగైన పత్తి పంటకు అధిక వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. పది రోజులుగా కురుస్తున్న వానలకు చేన్లు నీరు పట్టి మొలకలు ఎర్రబారుతున్నాయి. ఎరువులు వేసి కలుపు తీసేందుకూ తెరపినివ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్, ములుగు మండల వ్యవసాయ డివిజన్ పరిధిలో పొలాలు నీటితో నిండి పత్తి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సీజన్ ఆరంభంలో వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు వేయలేని ప్రతికూల పరిస్థితుల్లో.. మృగశిర కార్తెలో కాస్త జల్లులు పడటంతో విత్తనాలు వేశారు. కొన్నిచోట్ల మొలకెత్తగా.. కొన్ని చోట్ల భూమిలోనే మురిగిపోయాయి.

జిల్లాలో దాదాపు పది వేల ఎకరాల్లో పత్తి పంట ప్రమాదకర స్థితికి చేరిందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గజ్వేల్, జగదేవపూర్, కొండపాక, చేర్యాల, మిరుదొడ్డి, సిద్దిపేట గ్రామీణం, వర్గల్, ములుగు, రాయపోల్, దుబ్బాక, దౌల్తాబాద్ మండలాల పరిధిలో నల్లరేగడి భూముల్లోని పత్తి పంటపై వర్షాల ప్రభావం అధికంగా ఉంది. వర్షాలు ఇలాగే కురిస్తే రూ.10 కోట్ల మేర పంట నష్టం వాటిల్లే ప్రమాదముందని అంటున్నారు.

రైతులకు సూచనలు

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు రైతులకు గజ్వేల్ డివిజన్ వ్యవసాయ అధికారి బాబు నాయక్ పలు సూచనలు చేశారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో మొక్కల సాళ్ల మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా కాలువలు తీసుకోవాలని సూచించారు. అధిక తేమ వల్ల పత్తి మొక్కలకు వేరుకుళ్లి తెగులు సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీన్ని అధిగమించడానికి మొక్క వయసును బట్టి పది గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, పది కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలని చెప్పారు.

రోజూ వర్షంలోనే పంట చేలు: రైతు మల్లయ్య

వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో పత్తి సాగుచేసిన చేనంతా నీరు చేరింది. ఇప్పుడిప్పుడే వస్తున్న మొలకలు ఎర్రబారుతున్నాయి. పెట్టుబడి చేతికి వస్తుందో రాదో తెలియడం లేదు. షావుకారు వద్ద అప్పు తెచ్చాం. సమయానికి వర్షాలు రాకపోవడంతో ఆలస్యంగా పంటలు సాగు చేశాం. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

సమస్యలు పరిష్కరించకుంటే.. పోరాటం ఉధృతం

- తాత్కాలిక సిబ్బందిని అడ్డుకున్న జిపి కార్మికులు
- 21వ రోజూ వినూత్న రీతిలో నిరసనలు
- సిఐటియు, అనుబంధ సంఘాల మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని పంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పలు జిల్లాల్లో ప్రయివేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా తమ సమ్మెకు సహకరించాలని కోరారు. బుధవారంతో 21వ రోజుకు చేరిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సిఐటియు, అనుబంధ సంఘాలు నిరసనల్లో పాల్గొని మద్దతు తెలిపాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వినూత్నంగా నిరసనలు తెలిపారు. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో ప్రయివేటు వ్యక్తితో పంచాయతీ ట్రాక్టర్‌తో పనిచేయిస్తుండగా కార్మికుడు అడ్డుకున్నాడు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెకు సహకరించాలని కోరారు. మండలంలో కండ్లు, చెవులు మూసుకుని నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా నాయకులు సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. మానకొండూర్ మండలంలో కార్మికులు తలకు ఉరితాళ్లతో వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఇల్లందకుంట మండలంలో దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి ర్యాలీ నిర్వహించారు. గంగాధర మండలంలో సిబ్బంది భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. మల్యాల మండలంలో మోకాళ్లపై నిల్చొని ఆవేదన వ్యక్తం చేశారు. కొనరావుపేటలో ఉరితాళ్లతో నిరసన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో సిఐటియు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. మంచాలలో చేపట్టిన దీక్షలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో చేపట్టిన సమ్మెకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు మద్దతు తెలిపి మాట్లాడారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట వర్షంలో దీక్ష కొనసాగించారు. దీక్ష కేంద్రం వద్ద వంటావార్పు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో జేసీకి వినతి పత్రం అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో జిపి కార్మికులు ర్యాలీ నిర్వహించారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సిఐటియు, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహం నుంచి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె శిబిరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మద్దతు తెలిపాయి. నాంపల్లిలో జీపీ కార్మికులు చేతులు జోడించి వేడుకుంటూ నిరసన తెలిపారు.

సేవా భారతికి ఎస్‌బిఐ కంప్యూటర్ల విరాళం

హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బిఐ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సికింద్రాబాద్ బాగు చేసిన 20 పాత కంప్యూటర్లను సేవా భారతీ సంస్థకు అందించింది. వీటిని ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ నెట్‌వర్క్-1 హైదరాబాద్ మంజూ శర్మ సేవా భారతీ తెలంగాణ డైరెక్టర్ కుల్దీప్ సక్సేనాకు అందజేశారు.

సంగీత సాహిత్య సాంస్కృతిక ప్రముఖులకు సినారె పురస్కారాలు

ప్రజాశక్తి కల్చరల్

శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సీల్ వెల్ కార్పొరేషన్ నిర్వహణలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై విఖ్యాత కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి 92వ జయంతి సభ జరిగింది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ముఖ్య అతిధిగా పాల్గొని సాహిత్య రంగంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివా రెడ్డికి ప్రముఖ గాయని ఎస్‌పి శైలజకు, సాంస్కృతిక సంస్థ కళా దర్బార్ స్థాపకుడు పొత్తూరి రంగా రావుకు సినారె పురస్కారలు బహుకరించి అభినందిచారు. వేదిక పై కళా పత్రిక రఫీ, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు ఆమని సుభాష్ చంద్ర తేజ్ తదితరులుతో పాటు శైలజ కూడా పాడి శ్రోతల ప్రశంస పొందారు

బిజెపి రాష్ట్ర కార్యాలయంలో లొల్లి

- మీడియా సాక్షిగా రచ్చరచ్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అగ్నిపర్వతం బద్దలయినప్పుడు లావా వెదజల్లినట్టుగానే బిజెపిలో నిరసన జ్వాల ఏదో ఒక రూపంలో ఎగసిపడుతూనే ఉంది. నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలోనే ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగటంతో రాష్ట్ర నాయకత్వం ఉక్కిరిబిక్కిరి అయింది. పావుగంటకుపైగా ధర్నా...మరో పావుగంట సేపు అర్వింద్ డౌన్...అర్వింద్ డౌన్...వీవాంట్ జస్టిస్..వీవాంట్ జస్టిస్... నినాదాలతో అంతా గందరగోళం నెలకొంది. ఆందోళనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డిపై 'ఏయ్ ఏం మాట్లాడుతున్నావ్.....' అంటూ తీవ్ర పరుషజాలంతో కార్యకర్తలు ఉగ్రరూపం దాల్చటం, కిషన్‌రెడ్డినే తమ వద్దకు రావాలని డిమాండ్ చేయడం వంటి పరిణామాలతో కాసేపు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అతి కష్టం మీద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాం సుందర్, ఆర్మూర్‌లో గత ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన వినయ్‌రెడ్డి, బాల్కొండ నుంచి రెండు సార్లు పోటీ చేసిన రాజేశ్వర్, బోధన్ మున్సిపాలిటీ బిజెపి ఫ్లోర్ లీడర్ రంజిత్, తదితర నాయకులకు ప్రకాశ్‌రెడ్డి, రాణి రుద్రమ దేవి, పలువురు నేతలు నచ్చజెప్పారు. కిషన్‌రెడ్డి తమకు న్యాయం చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మరోవైపు అర్వింద్ మాత్రం మండలాధ్యక్షుల మార్పులో తన ప్రమేయమేమీ లేదంటూ దాటవేయడం గమనార్హం.

గోదావరి బేసిన్‌కు జలకళ

- శ్రీరామసాగర్, నిజాంసాగర్‌కు పెరిగిన ప్రవాహం
- ముమ్మరంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తాజాగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి బేసిన్ ప్రాజెక్టు పరిధిలోని జలాశయాలు కళకళ్లాడుతున్నాయి. నిండు కుండలా కనిపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో, రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు ఎక్కువగా చేరుతోంది. పరీవాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టులకూ వరద ప్రవాహాలు పెరిగాయి. శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు 1,21,008 ఇన్ ఫ్లో ఉండగా, 882 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 90.31 టీఎంసీలకు గాను,63.47 టిఎంసిలు నీళ్లు నిల్వఉన్నాయి. ఇప్పటికే నిండిన నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 48,475 క్యూసెక్కులు, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 22.440 క్యూసెక్కుల వరద వస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు ప్రస్తుతం 5.99 క్యూసెక్కుల వరద వస్తుండగా, 385 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతున్నది. జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 21.48 టిఎంసిలకు చేరుకుంది. మేడిగడ్డ వద్ద లక్ష్మీ బ్యారేజీకి 5,49,210 క్యూసెక్కుల వరద వస్తుండగా, 5.49 లక్షల క్యూసెక్కుల నీటిని 75 గేట్ల ద్వారా కిందకు వదులుతున్నారు. అదేవిధంగా మిడ్ మానేరు రిజర్వాయర్‌లో 27.50 టిఎంసిల నీటీ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 15.72 టిఎంసిల నీరు నిల్వ ఉంది. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు రైతన్నలకు వరంగా మారాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు బుధవారం సమాచార, పౌరసంబంధాల శాఖ ఒక ప్రకటన జారీచేసింది.

1,520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 1,520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో ఈ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు (తెలంగాణ వైద్యసేవల నియామక మండలి) ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టుల కోసం బోర్డు వెబ్‌సైట్ mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఆగస్టు 25 ఉదయం 10.30 గంటల నుంచి సెప్టెంబర్ 19 సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు ఆ నోటిఫికేషన్లో పేర్కొంది.

వైద్యారోగ్యశాఖలో జాబ్ మేళా

వైద్యారోగ్యశాఖలో జాబ్ మేళా కొనసాగుతోందని ఆ శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఇప్పటికే స్టాఫ్ నర్సుల నియామకాల కోసం పరీక్ష నిర్వహించనున్న బోర్డు తాజాగా ఎంపిహెచ్ఎ (ఎఫ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందంటూ ట్వీట్ చేశారు. అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

చరిత్రను వెలికితీస్తున్నాం

- చందో వైవిధ్య గ్రంథావిష్కరణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రచయిత సంగయ్యను అభినందించిన మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రంలో మరుగున పడ్డ చరిత్రను వెలికితీస్తున్నాం. చారిత్రక, శాసన, భాషా పరిశోధనలో కొత్త కోణాలను వెలికి తీయడం దేశ శాసన పరిశోధనలో తొలి ప్రయత్నం' అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో ప్రముఖ రచయిత, చరిత్ర పరిశోధకులు డాక్టర్ లగడపాటి సంగయ్య రూపొందించిన 'కాకతీయుల శాసనాలలో ఛందో వైవిధ్యం' అనే గ్రంథాన్ని మంత్రి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంగయ్యను అభినందించి మాట్లాడుతూ చరిత్ర రచన, శాసన, భాషా శాస్త్రంలో కొత్త కోణాలను వెలికితీయడం తొలి ప్రయత్నమన్నారు. కాకతీయుల కాలంనాటి 142 శాసనాలను అధ్యయనం చేసి 49 రకాల చందస్సును విశ్లేషించడం గొప్ప విషయమని తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక అంశాలు, శాసన పరిశోధన గ్రంథాలను సేకరించి ప్రచురిస్తున్నామని వెల్లడించారు.